'వార్తలు సమాప్తం - లోపలి కథ మొదలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీ శంకర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కవి యాకూబ్, కోయ చంద్రమోహన్ తదితరులు - 'మల్లెల తీర్థం - మహా ఖననం' పుస్తకావిష్కరణలో జీఎస్ రాములు, ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్, పీఓడబ్ల్యూ సంధ్య, తదితరులు - కోయి కోటేశ్వర రావు రచించిన 'నాగ స్వరం' కవితా సంపుటిన ఆవిష్కరణ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవి శిఖామణి, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, తదితరులు

పాఠక సందోహం.. పుస్తక ప్రదర్శన

పుస్తక ప్రేమికులు, పలువురు సాహితీవేత్తల నడుమ పలు పుస్తకాల ఆవిష్కరణ

పుస్తక ప్రియులతో వివిధ వేదికలు, స్టాల్స్ కిటకిట

చిక్కడపల్లి, డిసెంబర్ 27: ఇందిరా పార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పుస్తక ప్రియుల సందడి కొనసాగుతుంది. శుక్రవారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరాడంతో సందడి నెలకొంది. బుక్ ఫెయిర్ రెండు వేదికలపై పలు సాహితీ కార్యక్రమాలతో పాటు పుస్తకావిష్కరణలతో కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాకూబ్, ఆర్.వాసులు మాట్లాడుతూ ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందన్నారు. మరో రెండు రోజుల్లో బుక్ ఫెయిర్ ముగియనుందని, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ సందర్శించారు.

'వార్తలు సమాప్తం.. లోపలి కథ మొదలు' ఆవిష్కరణ

'చరిత్ర సగం రాసిన వాక్యం' అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ అన్నారు. తెలంగాణ పబ్లికేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు రచించిన వ్యాసాల సంకలనం 'వార్తలు సమాప్తం.. లోపలి కథ మొదలు'' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని బుక్ ఫెయిర్ వేదికపై నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మల్లన్న సాగర్ రైతుల పక్షం నిలిచినట్లుగానే లగచర్ల అంశం పట్ల స్పందించాలన్నారు. జర్నలిస్టుల వాక్యాలకు పదను వుంటుందన్నారు. సామాజిక చింతన వున్న వారే గొప్ప జర్నలిస్టులు అవుతారని పేర్కొన్నారు. రచయిత పీవీ రావు నన్ను కదిలించిన సంఘటనలు రాశారన్నారు. కవి, కేంద్ర సాహిత్య అకాడమీ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మిమిక్రీ ఆర్టిస్ట్ రమేశ్, సింగరేని మాజీ డైరెక్టర్ డీఎల్ ఆర్.ప్రసాద్, కొండపల్లి పవన్, తెలంగాణ పబ్లికేషన్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.

'నాగ స్వరం' పుస్తకావిష్కరణ

కోయి కోటేశ్వర రావు 'నాగ స్వరం' కవితా సంపుటి అంబేద్కర్, పూలే భావజాలానికి అక్షర రూపం అని సుప్రసిద్ధ కవి శిఖామణి అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తోపుడు బండి సాదిక్ వేదికపై కోయి కోటేశ్వర రావు రచించిన 'నాగ స్వరం' కవితా సంపుటిని ముఖ్య అతిథిగా శిఖామణి ఆవిష్కరించి మాట్లాడారు. అస్తిత్వ ఉద్యమాల భావజాలాన్ని శక్తివంతంగా తన కవిత్వంలో కోటేశ్వర రావు ఆవిష్కరించారని అన్నారు. నాగ స్వరంలో కోటేశ్వర రావు కవిత్వం, విమర్శ పరిశోధన లాంటి భిన్న ప్రక్రియల్లో బహుముఖీన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. సభలో ప్రముఖ విమర్శకులు డా. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, కోయి కోటేశ్వర రావు రాసిన కవిత్వంలో గొప్ప జీవన ఆర్తి ఉందని, ఫాసిజంపై తీవ్రంగా వ్యతిరేకించే తత్వం ఉందన్నారు. ప్రముఖ సాహితీ వేత్త పసునూరి రవీందర్ మాట్లాడుతూ, కోయి కవిత్వం తనకెంతో ఇష్టమని వస్తు రూపాలను సముచితంగా సమన్వయం చేస్తూ పది కాలాలు నిలిచి పోయే కవిత్వం రాశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన యోగి వేమన వర్శిటీ ఆచార్యులు ఎం.ఎం.వినోదిని మాట్లాడుతూ కోయి కవిత్వంలో సమాజం పట్ల ధర్మాగ్రహంతో పాటు ఆర్ద్రత కూడా కనిపిస్తుందన్నారు. బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్, ప్రభుత్వ సిటీ కళాశాల ఆచార్యులు డా. నీరజ ప్రముఖ కథా రచయిత నక్కా విజయ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'మల్లెల తీర్థం మహా ఖననం' పుస్తకావిష్కరణ

బుక్ ఫెయిర్ వేదికపైన రచయిత సిద్ధార్థ కవిత్వం 'మల్లెల తీర్థం మహా ఖననం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పీఓడబ్ల్యూ సంధ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత సృష్టించిన కవిత్వం అంతా ప్రజల కోసమే అని ఆమె అన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత బీఎస్ రాములు మాట్లాడుతూ, ఈ పుస్తకంలో తెలంగాణ భాషను అద్భుతంగా కవిత్వీకరించారని తెలిపారు. ఏలె లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, అంబటి సురేంద్రరాజు, కవి యాకూబ్ పాల్గొన్నారు.

'అరుణిమ', 'త్రికాల్' చారిత్రాత్మక నవల ఆవిష్కరణ

రచయిత్రి డాక్టర్ సంధ్య విప్లవ్ పుస్తకం 'అరుణిమ', 'త్రికాల్' చారిత్రాత్మక నవల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత బీఎస్ రాములు మాట్లాడుతూ, ఉద్యమాలు చేసిన కాలం నాటి రోజులను ఈ పుస్తకం గుర్తు చేసిందన్నారు. ఈ పుస్తకంలోని కథనం చాలా ఉద్వేగపూరితంగా సాగిందని తెలిపారు. ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ సతీశ్ చందర్, ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ, అట్టడుగున ఉన్న వర్గాల వాళ్లు రాయకపోతే సమాజానికి చాలా నష్టం అని పేర్కొన్నారు. ఒక స్త్రీ కలం పట్టడం, స్త్రీ జీవితాన్ని రాయడం సాధారణ విషయం కాదన్నారు. సమావేశంలో ప్రముఖ రచయిత, వీక్షణం పత్రిక వ్యవస్థాపకుడు ఎన్.ఆవేణుగోపాల్, కోయి కోటేశ్వర రావు, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, భంగ్యానాయక్, బండారు విజయ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగూడలో మండల పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

అయ్యప్ప పూజలో ఎమ్మెల్సీ కవిత

అడ్డగుట్ట, డిసెంబర్ 27: మెట్టుగూడ అయ్యప్పస్వామి మండల పూజ ఊరేగింపు ర్యాలీ గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికి ఆమెకు సత్కారం చేశారు. అనంతరం, నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఊరేగింపు ర్యాలీని కమిటీ నిర్వాహకులు ఎంతో భక్తి శ్రద్ధలతో అట్టహాసంగా నిర్వహించారని తెలిపారు. ఊరేగింపు ర్యాలీలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు, కమిటీ నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న దేవీప్రసాద్

అనుకరణ దిగ్గజం నేరెళ్ల వేణుమాధవ్

బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

ముషీరాబాద్, డిసెంబర్ 27: అనుకరణ కళను శాస్త్ర బద్ధం చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన నేరెళ్ల వేణు మాధవ్ అనుకరణ దిగ్గజం అని బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా.. విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నేరెళ్ల వేణుమాధవ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై పుట్టిన ఎందరో ప్రతిభావంతులలో నేరెళ్ల వేణుమాధవ్ ప్రముఖులని కొనియాడారు. ఐక్య రాజ్య సమితిలో మిమిక్రీ కళా ప్రదర్శన చేసి దేశ ప్రతిష్టను నిలిపారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మిమిక్రీ కళాకారుడు మల్లం రమేశ్, ఆర్సీఎం రాజు భవిరి, శివప్రసాద్, షరీఫ్, అంజన్ కుమార్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో 94 వేల ఇండ్లల్లో సర్వే పూర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా మంజూరు చేసిన నేపథ్యంలో, జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది. ప్రభుత్వం గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు మాత్రమే సర్వే చేయాలని నిర్దేశించిన తరుణంలో 10,70,446 మంది ఇందిరమ్మ ఇండ్లకు విన్నవించారు. దీంతో సర్వే చేసేందుకు వార్డుల వారీగా టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 883 లాగింగ్ కేటాయించగా, 94వేలకు పైగా సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు. వార్డుల వారీగా డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వే జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో అల్లు అర్జున్ కేసు విచారణ వాయిదా

జనవరి 10కి హాజరుకావాలని ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): పుష్ప-2 హీరో అల్లు అర్జున్ 9వ అదనపు చీఫ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు శుక్రవారం హాజరుకావాల్సి ఉండగా, ఆన్‌లైన్ వాట్సాప్ వీడియో ద్వారా విచారణను వాయిదా వేస్తూ మెజిస్ట్రేట్ నిర్మల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 10కి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. చిక్కడపల్లి డీసీపీ ఆనంద్‌తో పాటు అధికారులు, పలు టీవీ ఛానళ్ల మీడియా ప్రతినిధులు అల్లు అర్జున్ రాక కోసం నాంపల్లి కోర్టుల పరిసర ప్రాంతం నిండిపోయింది. బందోబస్తు నేపథ్యంలో ఆన్‌లైన్ వాట్సాప్ వీడియో కాన్ఫరెన్స్ ఉపయుక్తంగా ఉంటుందని మెజిస్ట్రేట్ న్యాయవాదికి సూచించారు. అభిమానుల్ని అదుపుచేసేందుకు నాంపల్లి పరిసర ప్రాంతాలన్నీ పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మెజిస్ట్రేట్ నిర్ణయంతో అధికారుల్ని, పోలీసుల బలగాన్నీ వెనక్కి పంపించారు. అల్లు అర్జున్ కోర్టుకు రావడం లేదని తెలుసుకున్న అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో 11వ ముద్దాయిగా ఉన్న అర్జున్ తరపున న్యాయవాది బెయిల్ పిటీషన్ సైతం దాఖలు చేశారు. సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాటలో రేవతి మృతికి అల్లు అర్జున్ రోడ్‌షో కారణంగా విషాదం జరిగిందని కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నమోదు చేసిన 105 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం, జిల్లా కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. చిక్కడపల్లి పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ కౌంటర్ దాఖలు చేశారు. సోమవారానికి వాదనల్ని వాయిదా వేస్తూ రెండో అదనపు జిల్లా జడ్జీ వినోద్ కుమార్ ఆదేశించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యంతర బెయిల్‌పై అల్లు అర్జున్ కొనసాగుతున్నారు. రెగ్యులర్ బెయిల్ పిటీషన్‌ను జిల్లా కోర్టులో న్యాయవాది అశోక్ రెడ్డి దాఖలు చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి శుక్రవారం కోర్టుకు వాదనలు వినిపించేందుకు నాంపల్లి కోర్టుకు చేరుకున్నప్పటికీ విచారణ వాయిదా పడటంతో ఆయన వెనుదిరిగారు. ఒక్కరోజు చంచల్‌గూడా జైలులో ఉన్న అర్జున్ మరుసటిరోజు విడుదలయ్యారు. ఇటీవల మీడియా సమావేశంలో అల్లు అర్జున్ మాట్లాడిన విషయాలపై పోలీసు అధికారులు మరోసారి నోటీసులు జారీ చేసి చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌లో విచారించారు. తదుపరి చర్యల కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకం

ఎనిమిది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): జిల్లా కోర్టులు, ట్రయల్ కోర్టులలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి ఆసక్తి అర్హత గల అడ్వకేట్‌లు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రయల్ కోర్టులు రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ట్రయల్ కోర్టు పటాన్‌చెరువు, రామచంద్రాపురంలో ఒకటి, సికింద్రాబాద్, హైదరాబాద్ ట్రయల్ కోర్టులో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. సంబంధిత జిల్లా బార్ అసోసియేషన్లలో 10 ఏండ్లు, సీనియర్ సివిల్ కోర్టులో ఏడేండ్లు జూనియర్ సివిల్ కోర్టులలో ఐదేండ్ల అనుభవం కలిగిన వారు అర్హులు అని చెప్పారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చే నెల జనవరి 23వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కార్యాలయ పనివేళలలో ట్యాంక్ బండ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వ్యర్థాల సేకరణ, విద్యుదుత్పత్తిపై ఇలంబర్తి ఆరా

జవహర్ నగర్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి శుక్రవారం అధికారులతో కలిసి జవహర్‌నగర్‌లోని మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఆర్ఎఫ్ఐడీ విధానం అమలు, వెయింగ్ బ్రిడ్జిలు, వ్యర్థాల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. రోజు జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు 8,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని అధికారులు వివరించారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై ఆరా తీశారు. 24 మెగా వాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, రెండో ఫేజ్ ప్లాంట్ పనులను పరిశీలించారు. 2014లో రోజు 3,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాల నుంచి ప్రస్తుతం 8,500 టన్నుల వరకు వ్యర్థ సామర్థ్యం చేరిందని, వేస్ట్ టు ఎనర్జీలోనూ ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని అధికారులు కమిషనర్‌కు వివరించారు.

ఎన్‌పీఎస్ ఫెలోకు ఎన్ఐఎన్ సైంటిస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఫెలోగా జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) పరిశోధకులు భానుప్రకాష్ రెడ్డి ఎంపికయ్యారు. ఎన్ఐఎన్ బయో కెమిస్ట్రీ విభాగాధిపతిగా పనిచేస్తూ న్యూట్రిషనల్ సైన్స్‌లో ఆయన చేసిన పరిశోధనలకు గాను ఫెలోషిప్‌కు ఎంపిక చేసినట్లుగా ఎన్ఐఎన్ వర్గాలు పేర్కొన్నాయి. పోషకాలు, పోషకాహార అవసరం, పోషకాహార లోపంతో వచ్చే దీర్ఘకాలిక వ్యాధులు, డయాబెటిస్‌లో సూక్ష్మ పోషకాల పాత్ర వంటి అంశాలపై ఆయన పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 250 పరిశోధనా పత్రాలు, పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను దక్కించుకున్న భానుప్రకాష్‌కు ఫెలోగా ఎంపిక కావడంతో అరుదైన గౌరవం దక్కిందని పలువురు ఎన్ఐఎన్ పరిశోధకులు వివరించారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ షురూ..

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ లైఫ్ స్టైల్ అండ్ వెడ్డింగ్ షాపింగ్ స్పెషల్ హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటీమణులు కామాక్షి భాస్కర్ల, శుభశ్రీ రాయగురు, స్రవంతితో కలిసి ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో డిజైనర్ వేర్, వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నర్సింగ్ షోరూమ్‌లో నటి వర్షిణి సందడి

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): అమీర్‌పేటలోని నర్సింగ్ షోరూమ్‌లో నటి వర్షిణి సౌందర్ రాజన్ సందడి చేశారు. షోరూమ్ రెనోవేషన్ చేపట్టిన తర్వాత శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నటి వర్షిణి సౌందర్ రాజన్ షోరూమ్‌లోని నూతన డ్రెస్ మెటీరియల్స్, ఫ్యాషన్, సంప్రదాయ వస్త్రాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

రేపు కొమురెల్లి మల్లన్న కల్యాణం

భారీగా జాతరకు తరలిరానున్న భక్తులు

చేర్యాల, డిసెంబర్ 27: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. మంత్రులు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరపున పడిగన్న గారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవి తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపిస్తారు. ఆదివారం ఉదయం 10:45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలోని తోట బావి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి

వద్ద గల కల్యాణ వేదికలో 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద పర్యవేక్షణలో కల్యాణం జరగనున్నది. ఉత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు.

వేలాదిగా భక్తులు

మల్లన్న కల్యాణోత్సవానికి 30 వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయ వర్గాలు తెలిపా యి. కల్యాణ వేదిక వద్ద భద్ర తా నిమిత్తం మరో ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశా రు. నూతనంగా నిర్మించిన భవనంలో ప్రసాదాల విక్ర య కౌంటర్ల వద్ద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. 60 వేల లడ్డూ ప్రసాదాలు, ఐదు క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లను తయారు చేయిస్తున్నారు. సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి

ఎమ్మెల్సీ ఎల్.రమణ

హిమాయత్‌నగర్, డిసెంబర్ 27: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటి సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. సంఘం మహిళా విభాగం ముద్రించిన 2025 – నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో జరిగింది. అనంతరం, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ అధ్యక్ష తన జరిగిన సమావేశంలో ఎల్.రమణ మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించి ఎదిగినప్పుడే కుటుంబంతో పాటు సమాజం బాగుంటుందన్నారు. మహిళలు రాజకీయ పరంగా రాణించి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పద్మశాలీ సంఘం నేతలు గడ్డం జగన్నాథం, అవ్వారి భాస్కర్, బర్రెంకల మధు సూదన్, వనం దుశ్యంతల, కమర్తపు మురళి, పుట్ట పాండు రంగయ్య, స్వప్నరాజ్, కందగట్ల శోభ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రమణ

ఎంసీసీ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

రెసిడెన్షియల్ అవసరాలకు వెంటనే ట్యాంకర్ నీరు

సమీక్షలో జల మండలి ఎండీ

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): జల మండలి మెట్రో కస్టమర్ కేర్ (ఎంసీసీ)కి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తాగునీటి సరఫరా, కలుషిత నీటి సమస్యల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ ఫిర్యాదులపై ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మ్యాన్‌హోళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలని ఎండీ చెప్పారు. ప్రస్తుతం, కొనసాగుతున్న 90 రోజుల డీసిల్టింగ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 16 వేల ప్రాంతాలలో లక్షా 65 వేల మ్యాన్‌హోళ్లలో పూడిక తీసినట్లు అధికారులు వివరించారు. అంతకు ముందు జల మండలి నీటి ట్యాంకర్ల బుకింగ్, సరఫరా తీరుపై ఈడీ సమీక్షించారు. ట్యాంకర్లు బుక్ చేసుకున్న వారికి వీలైనంత వెంటనే సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ అవసరాలకు ట్యాంకర్లు బుక్ చేసుకునే వారికి సరఫరాలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఈడీ అధికారులను ఆదేశించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీతోనే అభివృద్ధి

స్టాన్లీ మహిళా కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

పాల్గొన్న వివిధ దేశాల ప్రొఫెసర్లు, పలు రంగాల నిపుణులు

అబిడ్స్, డిసెంబర్ 27: సైన్స్ అండ్ టెక్నాలజీని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం వల్లనే అభివృద్ధి జరుగుతుందని, సాంకేతికతలో కృత్రిమ మేధ ప్రాముఖ్యత కలిగి ఉందని వియత్నాం దేశానికి చెందిన హనోయ్ యూనివర్శిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ న్యూయెన్ హంసంగ్ అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో తొమ్మిదవ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రీసెర్చ్ ఇంటల్లీజెంట్ కంప్యూటర్ ఇంజనీరింగ్ (రైస్-2024)పై మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైద్రాబాద్, యూనివర్సిటీ ఆఫ్ డాన్‌బాస్కో ఎల్ సాల్వీడార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు విదేశాలకు చెందిన వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అంతర్జాతీయ సదస్సు ప్రారంభానికి ముందుగా హాజరైన అతిథులు, కళాశాల కరెస్పాండెంట్ కె.కృష్ణారావు, దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అంతర్జాతీయ సదస్సు (రైస్-2024)కు కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.స్వప్న అధ్యక్షత వహించగా, వియత్నాం దేశానికి చెందిన హనోయ్ యూనివర్శిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ న్యూయెన్ హంసంగ్ గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం వల్ల అభివృద్ధి అవుతుందన్నారు. కంప్యూటర్ రంగంలో నేడు కృత్రిమ మేధ అనేది ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని చెప్పారు. కృత్రిమ మేధ వల్ల వీలు కాని సమస్యలను కూడా అతి సులభంగా పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. సాంకేతికత అనేది అన్ని రంగాల అభివృద్ధికి ఎంతో సహకరిస్తుందని చెప్పారు. కృత్రిమ మేధ నేడు సాఫ్ట్ వేర్ రంగమే కాకుండా పారిశ్రామిక, వైద్య రంగాలలో అద్భుతంగా ఫలితాలను ఇస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మలేషియా ద